క్లుప్తంగా

రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయండి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: గుర్రంగూడ ప్రధాన రహదారి విస్తరణకు నిధులు మంజూరు చేయాలని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత కోరారు. గురువారం రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని పేర్కొన్నారు. గతంలో హెచ్‌ఎండీఏ నిధులు మంజూరు అయినట్లు నాటి ప్రభుత్వం తెలిపిందని, కానీ పనులు మాత్రం చేయలేదని విమర్శించారు. రోడ్ల విస్తరణ కోసం సుమారు రూ.5 కోట్లు కేటాయించాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

భూ పంచాయితీని పరిష్కరించండి

పహాడీషరీఫ్: తమను పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుగా ప్రహరీ నిర్మిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మామిడిపల్లి గ్రామ కావలికారు రైతులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన దాదాపు 50 మంది గొండ్యాల, కోట్ల వంశస్తులు 2007 నుంచి 99/1 సర్వే నంబర్‌లో సాగు చేసుకుంటున్నారు. కాగా ఈ నెల మొదటి వారంలో వీరి భూముల్లోని షెడ్లను, వారి పక్కన స్థలం యజమాని కూల్చివేయడంతో నాడు ఆందోళన నిర్వహించారు. తాజాగా బుధవారం రాత్రి రైతులు వారి పొలాల్లోకి వెళ్లకుండా సదరు వ్యక్తి గోడ నిర్మించడంతో గురువారం ఉదయం బాధిత రైతులు ఆందోళనకు దిగారు. అనంతరం బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. భూ పంచాయితీకి పరిష్కారం చూపాలని పేర్కొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



ఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మీర్‌పేట: మున్సిపల్ కార్యాలయం వద్ద 25వ తేదీ శుక్రవారం జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ బాలాపూర్ మండల కన్వీనర్ వి.శేఖర్‌యాదవ్ పిలుపునిచ్చారు. ధర్నాకు మున్సిపల్ కార్మికులను అనుమతించాలని కోరుతూ గురువారం మీర్‌పేట రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలుచేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను పూర్తిగా రద్దుచేయాలన్న ప్రధాన డిమాండ్లతో ధర్నా చేపడుతున్నామని తెలిపారు. నాయకులు దాసరి బాబు, యాదగిరి, నర్సింహ, బాబమ్మ, భారతి ఉన్నారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కొర్ర రాములు, పత్లావత్ తరుణ్, పాపగళ్ల కార్తీక్‌లు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలుర వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అందులో కొర్ర రాములు జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల మోకిలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో పులిమామిడి పాఠశాల జట్టు నిలిచింది. కాగా ఈ నెల 25న వికారాబాద్‌లో నిర్వహించనున్న రంగారెడ్డి, వికారాబాద్, మల్కాజ్‌గిరి జిల్లాల అండర్–17 వాలీబాల్ పోటీల్లో ఆ ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నారు. కాగా గురువారం ఆ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, పీడీ స్వామితో పాటు ఉపాధ్యాయులు బుచ్చయ్యగుప్తా, శ్రీనివాసులు, స్టాన్లీ, జయంతి, శ్రీవిద్య, చెన్నయ్య, రాములు, రామారావు, ప్రసన్న, శిరీష తదితరులు అభి నందించారు. విజయం సాధించి పాఠశాల, ఊరు, జిల్లాకు మంచిపేరు తేవాలని కోరారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

పేదరికాన్ని ఆసరాగా చేసుకుంటున్న దుండగులు
- యువతులు అప్రమత్తంగా ఉండాలి
- ఎంపీడీఓ వెంకటమ్మ, ఇన్‌చార్జి సీడీపీఓ తులసి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీఓ తులసి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆడపిల్లల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ వెంకటమ్మ కోరారు. గురువారం మండలంలోని సీడీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓతో పాటు ఇన్‌చార్జి సీడీపీఓ శాంతిశ్రీలు మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా వేగంగా పెరిగిపోతుందని తెలిపారు. ఈ ఉచ్చులో ఎంతో మంది అమ్మాయిలు చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం పేదరికమేనని వెల్లడించారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకొని ఉద్యోగం, సినిమా అవకాశాలు, ప్రేమ, పెళ్లి పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. అలాంటి వారి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలతో సన్నిహితంగా ఉండే అంగన్‌వాడీ టీచర్లు అలాంటి వారి ఆర్థిక సామాజిక స్థితి గతులను గమనించి, వారికి తగిన అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా యుక్త వయస్సు యువతులు, మహిళా సంఘాల వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ సురేష్, సూపర్ వైజర్ పల్లవి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ అంబర్ సింగ్, చెన్న కేశవ్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సరళ, కల్పన, అరుణ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



పార్టీ సభ్యత్వం నమోదు చేయిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కమలనాథులు కలిసి పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధి ముచ్చర్ల, ఊట్లపల్లి, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల వారీగా అన్ని వర్గాల ప్రజలతో సభ్యత్వం చేయించాలని సూచించారు. ప్రధాని మోదీ.. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బక్క మల్లేశ్, కృష్ణయ్య, మహేందర్, నాగిరెడ్డి, శ్రీను, కిషన్, రాఘవేందర్, చెన్నయ్య, రామకృష్ణ, దుర్గేశ్, బాల్‌రాజ్, రాజు, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగిరం చేయండి

తలకొండపల్లి: బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు ఈ నెల 25వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. 100 సభ్యత్వాలు పూర్తి చేసిన వారికి, అదే విధంగా మహిళా నాయకురాళ్లు కనీసం 25 నుంచి 30 వరకు సభ్యత్వ నమోదు చేయించినట్లు అయితే క్రియాశీలక సభ్యత్వానికి అవకాశముంటుందని పేర్కొన్నారు. ఆ దిశగా శ్రేణులు పనిచేయాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో 10వేలకు పైగా సభ్యత్వాలు నమోదు అయ్యాయని, ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని తెలిపారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండల పరిధి గట్టుఇప్పలపల్లికి చెందిన కావలి కృష్ణయ్య ఇటీవల మృతి చెందాడు. మృతుడు గతంలో వీఆర్‌ఏగా, చనిపోయే ముందు రోజు వరకు మిషన్ భగీరథలో విధులు నిర్వహించాడు. పూర్వ పరిచయ నేపథ్యంలో పలువురు వీఆర్‌ఏలు మృతుడు కృష్ణయ్య కుటుంబ సభ్యులకు గురువారం రూ.10,500లు ఆర్థిక సహాయం అందజేశారు. రమేష్, మల్లేశ్, చంద్రమౌళి, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి

తలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం సీనియర్ నాయకుడు యాదయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిధి పడకల్‌లో పార్టీ గ్రామ శాఖ మహాసభలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య, ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ వెంకటయ్య మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. పార్టీ పరంగా కాకుండా, ప్రజాభిప్రాయం మేరకు గ్రామ సభల్లో ఇందిరమ్మ కమిటీలను ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా జల్లెల పెంటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏరియా కమిటీ సభ్యుడు కురుమయ్య, రమేష్, పర్వతాలు, జంగయ్య, పోచయ్య, రాములమ్మ, వెంకటయ్య, పెంటయ్య, యాదయ్య పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం



వడ్డెరబస్తీలో బాధితులతో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

మలక్‌పేట: మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను ఇబ్బందులు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన మూసారంబాగ్ డివిజన్ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్, ఫ్రెండ్స్‌కాలనీ, వడ్డెరబస్తీ, శాలివాహననగర్ వాంబేకాలనీ, అంబేడ్కర్ కాలనీలో బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పేరుతో 40 ఏళ్లుగా ఉంటున్న పేదలను ఖాళీ చేయించడం తగదన్నారు. దొంగచాటున మార్కింగ్ చేసి, వాటిని తొలగించి బడాబాబులకు ధారాదత్తం చేయాలనే ఆలోచన మానుకోవాలని హితవుపలికారు. ప్రజా అభిప్రాయ సేకరణ చేయకుండా జీఓ తీసుకు రావడం సమంజసం కాదన్నారు. మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్, లీగల్‌సెల్ జిల్లా కన్వీనర్ ఆవుల ప్రవీణ్‌యాదవ్, నాయకులు లింగాల హరిగౌడ్, వంజరి వినోద్, గజానంద్, భరత్, రమణ్‌సింగ్, నవీన్‌రెడ్డి, దినేష్, రాంచందర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ ఆధార్ సెంటర్‌కు స్పందన



పేర్ల నమోదుకు వచ్చిన ట్రాన్స్‌జెండర్స్

చాదర్‌ఘాట్: ట్రాన్స్‌జెండర్స్ కోసం ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌కు విశేష స్పందన వస్తోందని వికలాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ అన్నారు. మలక్‌పేటలోని ప్రధాన కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆధార్‌కార్డుల జారీ ప్రక్రియ ముగింపును గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల్లో దాదాపు 120 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు ఆధార్ కార్డులు జారీ చేశామన్నారు. ఇంత మంది బయటకు వచ్చి గుర్తింపు కార్డులు తీసుకోవడం గొప్ప పరిణామమన్నారు. త్వరలో వీరందరికీ స్కిల్ డెవలప్‌మెంట్‌లో ట్రెనింగ్ ఇచ్చి, సమాజంలో వారికి గుర్తింపు కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం మన రాష్ట్రంలోనే నిర్వహించడం తెలంగాణకు దక్కిన గౌరవమన్నారు. ఈ కార్యక్రమాన్ని చూసిన ఇతర రాష్ట్రాల అధికారులు మన డేటా అడుగుతుండటం విశేషమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామర్ మేనేజర్ డాక్టర్ జయంతి, ట్రాన్స్‌జెండర్స్ కో ఆర్డినేటర్ ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ అవుట్‌పాయింట్‌తో అవస్థలు

- ఇరుకురోడ్డుతో నిత్యం ట్రాఫిక్ జాం
- విలేజ్ రోడ్డుకు అవుట్ పాయింట్ లింకుచేస్తే మరిన్ని ఇక్కట్లు
- బిజినెస్ దెబ్బతింటుందంటూ వ్యాపారుల ఆందోళన
- విలేజ్ రోడ్డుకు అనుసంధానం చేయొద్దని స్థానికుల విన్నపం



కొనసాగుతున్న బస్టేషన్ విస్తరణ పనులు



చేవెళ్ల విలేజ్ రోడ్డుపై ఉన్న దుకాణాలు తప్పని ఇబ్బందులు

చేవెళ్ల: ఆర్టీసీ బస్‌స్టేషన్ విస్తరణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న నూతన మార్గాలను ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా నిర్మించొద్దని చేవెళ్ల గ్రామస్తులు, దుకాణాదారులు కోరుతున్నారు. మండల కేంద్రంలో ప్రయాణ ప్రాంగణ విస్తరణ పనులు జరుగుతున్నాయి. బస్టాండు నుంచి బస్సులు బయటకు వెళ్లే అవుట్ పాయింట్‌ను చేవెళ్ల గ్రామం రహదారి వైపు ఏర్పాటు చేసేలా మార్కింగ్ చేశారు. బస్టాండు డిజైన్ ప్రకారం కాంట్రాక్టర్ తన పనులను యాథావిధిగా కొనసాగిస్తున్నారు. ఈ రోడ్డుకు అవుట్‌పాయింట్ పెట్టడంతో విలేజ్ రోడ్డుపై ప్రయాణించే ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ప్రాంతవాసులు తెలిపారు. ప్రస్తుతం బస్‌స్టేషన్‌కు ఉన్న ఇన్, అవుట్ పాయింట్‌నే యాథావిధిగా కొనసాగించేలా చూడాలని కోరుతున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు మరోసారి ఆలోచించాలన్నారు. గతంలో మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఈ బస్‌స్టేషన్ పరిశీలనకు వచ్చినప్పుడు గ్రామస్తులు, స్థానిక నాయకులు, వ్యాపారులు కలిసి విషయం ఆయనకు వివరించామని, ఆర్టీసీ అధికారులతో మాట్లాడాలని కోరామని స్థానికులు వెల్లడించారు. అవుట్‌పాయింట్ విలేజ్ రోడ్డుకు అనుసంధానం చేస్తే.. బిజినెస్ దెబ్బతింటుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బస్సుల రాకపోకలతో దుకాణాల ఎదుట క్రయవిక్రయ దారులు తమ వాహనాలు పార్కు చేసుకునే అవకాశం ఉండదని, అంతిమంగా తమ జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని పేర్కొంటున్నారు. బస్టాండులో ఏర్పాటు చేసిన దుకాణ దారులకు ఇబ్బందిగానే ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయని, సంస్థ అధికారులు పునరాలోచించాలని స్థానికులు కోరుతున్నారు.

అసలే ఇరుకు రోడ్డు..



బస్టేషన్ నుంచి బయటకు వచ్చే బస్సుల కోసం విలేజ్ రోడ్డుకు అవుట్ పాయింట్ లింకుపెడితే బస్సులు వచ్చే ప్రతిసారి ట్రాఫిక్ జామ్ అవుతుంది. అసలే ఈ రోడ్డు ఇరుకుగా ఉంటుంది. ఇప్పుడు అవుట్ పాయింట్‌ను అనుసంధానం చేస్తే.. ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పవు. మా బిజినెస్ దెబ్బతింటుంది. అవుట్ పాయింట్‌ను వెంటనే మార్చాలి.

– ముకేశ్, ఫుట్‌వేర్ దుకాణాదారుడు

నిత్యం ట్రాఫిక్ జాం



హైదరాబాద్–బీజాపూర్ రహదారికి విలేజ్ రోడ్డు ఆనుకొని ఉంది. అదేవిధంగా బస్టేషన్‌కు కూడా పాత రోడ్డు అలాగే ఉంది. విలేజ్ రోడ్డుకు అవుట్‌పాయింట్‌ను కలిపితే.. గ్రామస్తులకు అవస్థలు తప్పవు. ఇప్పటికే దుకాణాల ఎదుట పార్కింగ్ సరిపోకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఇక బస్సులు కూడా ఇటు నుంచి వెళ్తే.. నరకప్రాయమే..

– సి.పాండు, బ్యాంగిల్ స్టోర్ యజమాని

దూరభారం.. సమయం వృథా

- పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు లేక ప్రజల ఇబ్బంది
- సకాలంలో పనులుకాక సతమతం
- స్థానికంగా డివిజన్ ఆఫీసులు ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డికి నాయకుల వినతి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: 'ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరో ప్రాంతానికి వెళ్లి పనులు చేయించుకునేందుకు సతమతం అవుతున్నారు. దీంతో దూరభారంతో పాటు.. సమయం వృథా అవుతోంది. డబ్బు ఖర్చు అవుతోంది. అయినప్పటికీ సకాలంలో పనులుకాక.. పదేపదే తిరగాల్సి వస్తుంది. స్థానికంగా ఆఫీసులు ఏర్పాటు చేయండి' అని ఆమనగల్లు మండల నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వైస్ ఎంపీపీ మాజీ సభ్యుడు అనంతరెడ్డి, కేఎస్‌ఆర్ సేవదలం వ్యవస్థాపక అధ్యక్షుడు బాబా, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్, విజయ్ రాథోడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ, సబ్ ట్రెజరీ, ఆర్డీఓ, సబ్ రిజిస్ట్రార్ తదితర ఆఫీసులను ఏర్పాటు చేయాలన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా..

ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలు కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధి, మాడ్గుల మండలం ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో ఉండగా.. సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు మహేశ్వరంలో ఉన్నాయని నాయకులు వెల్లడించారు. దీని వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని, స్థానికంగా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానని స్పష్టంచేశారు.

డౌన్స్ సిండ్రోమ్ వ్యాధిపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

నందిగామ: ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఇద్దరికి వ్యాపించే డౌన్స్ సిండ్రోమ్ వ్యాధి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిమ్స్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ రమ్యకృష్ణ సూచించారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో గురువారం జిమ్స్ ఆస్పత్రి, హోమియోపతి కళాశాల ఆధ్వర్యంలో డౌన్స్ సిండ్రోమ్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్యకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైద్య విద్యార్థులు గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి లక్షణాలు ఏ విధంగా ఉంటాయో వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. వెయ్యి మందిలో ఇద్దరు పిల్లలు ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. వ్యాధిని హోమియోపతి మందులతో తగ్గించొచ్చని, వ్యాధి సోకిన పిల్లలు సాధారణ పిల్లల మాదిరిగానే ఉంటారు పేర్కొన్నారు. పిల్లల్లో వచ్చే ఎముకలు, కీళ్లకు సంబంధించిన వ్యాధులు వాటి లక్షణాలు, త్వరగా గుర్తించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లలు ఏ మాత్రం అనారోగ్యానికి గురైనట్లు గుర్తించినా.. వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు భవ్యశిఖ, విరాజ్, సుచి, రుఖియా, లహరి, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతను చాటుదాం



మాట్లాడుతున్న చైర్మన్ బక్కన్నయాదవ్

సింగిల్ విండో చైర్మన్ బక్కన్నయాదవ్

షాద్‌నగర్: యాదవుల ఐక్యతను చాటి సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని సింగిల్ విండో చైర్మన్ దారమోని బక్కన్నయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని మల్లికార్జున మినీ ఫంక్షన్‌హాల్‌లో యాదవ సంఘ నాయకులతో ఆయన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవుల సంస్కృతి సంప్రదాయాలకు సదర్ వేడుక ప్రతీక అన్నారు. అందరూ ఐకమత్యంతో ముందుకుసాగి సదర్‌ను జయప్రదం చేయాలని కోరారు. షాద్‌నగర్‌లో పదేళ్లుగా సదర్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా నవంబర్ 10న పట్టణంలోని ముఖ్య కూడలిలో సదర్ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, నడికూడ రఘునాథ్‌యాదవ్, యాదగిరియాదవ్, జంగ నర్సింలు, తుమ్మల నర్సింహ, షాబాద్ మల్లేశ్, బాత్క దేవేందర్, కృష్ణయాదవ్, ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్, నక్క బాల్‌రాజ్, శ్రీనివాస్‌యాదవ్, మన్నె నారాయణ, పద్మారం వెంకటేశ్, పరంధాములు, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం



పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

చేవెళ్ల: బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పార్టీ మండల ఉపాధ్యక్షులు జి.కృష్ణాగౌడ్, డి.శర్వలింగంలు అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం మండల నాయకులతో కలిసి వారు ఇంటింటికీ తిరిగి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ నమోదుతో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. పార్టీ ఇచ్చిన టార్గెట్‌లను పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలు సభ్యత్వ నమోదుకు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకుడు ఆంజనేయులుగౌడ్, బీజేవైఎం జిల్లా నాయకుడు ఇంద్రాసేనారెడ్డి, మండల నాయకులు పి.కృష్ణ, మానిక్యం, వెంకటేశ్, మల్కాపూర్ బూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మల్లేశ్, శివకుమార్, బంటు శ్రీనివాస్ ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



దివ్యాంగులతో మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు విజయవంతం చేసేందుకు దివ్యాంగులు పెద్దఎత్తున తరలిరావాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్ వివిధ గ్రామాల్లో ఉన్న దివ్యాంగులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హక్కులను సాధించుకునేందుకు దివ్యాంగులందరూ కలిసి రావాలని సూచించారు. సమష్టిగా పోరాడితేనే హక్కులను సాధించుకుంటామని పేర్కొన్నారు. హక్కులతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. హక్కుల సాధనకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నుంచి నిర్వహించే రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరు కానున్నారని తెలిపారు. మహాసభలకు దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386